# అనుకునేది, అనేది

సెలవునాడు పడింది జనవరి ఫస్టు. ఇదివరకు కొన్నాళ్లు జనవరి ఫస్టే సెల వుండేది. క్రమంగా ఎవరి పుణ్యమోగాని జనవరి ఫస్టు సెలవు కాన్సిల్ చేసెసేరు. నాలాంటి వాళ్ళకి శ్రమ తగ్గించేరు.

పొద్దున్న ఏడింటికి బయల్దేరాను. సంచిలో పధ్నాలుగు ఏపిల్‌పళ్ళు, పది గ్రీటింగ్ కార్డులు, రెండు డయిరీలు, నోటినిండా మాటలూ పోగుచేసుకొని, కడుపునిండా ఆయిలు పొయ్యమని నా వాహనం అడిగింది. బొగ్గు నింపమని ఆత్మారాముడు అడిగేడు. అది అయిందని పించి మొత్తం ముప్ఫయి రూపాయల పైచిలుకు వదలగొట్టు కున్నాను.

"వీడు వస్తాడో రాడో" అని భయంచేత డిసెంబరు 26నే గ్రీటింగులు పంపిన వాళ్లు; ఆఫీసులో వాసు, సూపరింటెండెంట్, హెడ్డు గుమస్తా, మేనేజరు, యిలాంటి వాళ్ళని, మా హోంశాఖ వారి హోమ్యోవైద్యులు, నా నడుం నొప్పికి పదహారేళ్ళబట్టి వైద్యం చేస్తున్న నారాయణహరిగారు, అగ్రహారంలో మా నివేశన స్థలంమీద

సివిల్ దావాగ్నికి సాయపడిన లాయరుగారు, మా అబ్బాయి చదివే స్కూలు హెడ్మాష్టర్‌గారు ఇలా ఎందరో మహానుభావులు అందర్నీ దర్శించుకుని ఒక కార్డు, ఓ యాపిల్‌పండు మిగిలిపోతే ఏం చెయ్యాలో ఎవర్ని మర్చిపోయానో తోచక పరధ్యానంగా వాహనాన్ని నడుపుతున్నాను.

ఆరిపాకవారి వీధికి వచ్చేసరికి నరసింహారావు గుర్తొచ్చేడు. అతన్నోసారి పలకరించి ఈ బరువు వదలగొట్టుకుందామని అతనింటి వేపు బండి తిప్పాను.

అక్కడేమిటి, అంతమంది జనం పోగడ్డారు?

కొంపదీసి నరసింహారావు కేమీ అవలేదుకదా, పాపం అసలే బి. పి. పేషంటు! అనుకుంటూ బండి ఆపాను.

నా బండి చప్పుడు ఆగ్గానే నరసింహారావు గొంతు గట్టిగా వినపడింది. ఇదీ అని చెప్పలేను. ఎవరిమీదో గట్టిగానే అరుస్తున్నాడు.

నరసింహారావు బ్యాంకు ఏజెంటు. నా కతని బ్యాంక్‌లో ఖాతా వుండేది. ఓవర్ డ్రాఫ్టు అడిగితే యివ్వలేదు. అంచేత వీలయినంత తక్కువ డబ్బు అక్కడుంచి వ్యవహారం స్థంభించేటట్టు చేసేశాను. అయినా అతను నా క్లాస్మేటు, మా నాన్నగారి స్నేహితుడి కొడుకు.

లోపలి కెళ్ళినందుకు విచారించకపోయినా లోపలికెళ్ళి విచారించేసరికి విచారమే కలిగింది. బ్యాంకు ఉద్యోగులలో మూడు సంఘాల వాళ్లు ఒక్కసారే గ్రీటింగ్స్ చెప్పడానికి వొస్తే వాళ్ళమీద నోరు చేసుకుంటున్నాడు నరసింహారావు.

"చూడవయ్యా, వీళ్ళ తమాషా! వీళ్ళందరికీట, నాకీ 1978వ సంవత్సరం కులాసాగా గడవాలని, శుభాల పరంపరలు కలగాలని వుందిట!" అని నన్ను కసిరినంత పని చేశాడు.

నరసింహారావుకి బి. పి. వుందని, అతన్ని ఆవేశపర్చొద్దని చెప్పేసి మెల్లిగా అందర్నీ పంపేశాను. "ఆ బుచ్చయ్య క్లాస్ ఫోర్

యూనియన్‌కి ప్రెసిడెంటు. వాళ్ళ ముఠా అందరూ ఒక కొండపక్కని జాగా ఆక్రమించి ఇళ్లు కట్టుకోడానికి బుణా లిప్పించమని అడిగి, నే నివ్వనంటే మా ఇంటి దగ్గర ధర్నాపెట్టేడు. ఈ సుబ్బారావుగాడు క్లర్కుగా చేరిందగ్గిర్నుంచీ మా అమ్మాయిని అల్లరిపెట్టని రోజు లేదు. ఆ రమణారావు నేను చస్తే బావుణ్ణని, కనీసం సెలవు పెడితే చాలని చూస్తాడు. ఇల్లీ నారాయణరావు లేడూ- ఓ రోజు డబల్ లాక్ వెయ్యడం మర్చిపోయి మర్నాడు నేను నాలుగు కేక లేసేననీ నేనే తప్పుచేసినట్టు హెడ్డాఫీసుకి ఆకాశరామన్న వుత్తరం రాసేడు. వీళ్లట, నేను కులాసాగా వుండాలని కోరుతున్నారట!" అని ఆవేశపడ్డాడు నరసింహారావు.

"ఏదో, ఫార్మాలిటీ!" అని సర్దిచెప్పాను.

"ఫార్మాలీటియా, నా మొహమా! ఎవడో పెట్టేడు వెధవ సంప్రదాయం. కలరా లాగా దేశం అంతా వ్యాపించింది దిక్కుమాలిన రోగం. ఎంత ఖర్చు; ఎంతశ్రమ; పైగా ఎన్ని అబద్ధాలు! ఒక్కడికైనా నిజంగా అవతలి వాడిమీద అభిమానం వుండి చేసేదేనా, ఈ అభినందన!'' అని గ్లాసుడు మంచినీళ్ళు తాగాడు.

నిజమే అనిపించింది నాకూనూ పొద్దుటినుంచీ పడుతున్నదేగా.

ఆ కబురూ యీ కబురూ చెప్పి, వెళ్ళిపోయేలోగా సంచిలో బరువు స్ఫురించి "ఈ నూతన వర్షం నీకు శుభవర్షాల పరంపర బొగాక!'' అంటూ ఏపిల్ పండూ, కార్డూ యిచ్చి షేక్హాండు కోసం చెయ్యి జాపేను.

"యూ టూ బ్రూటస్?'' అని గట్టిగా అరిచి కుర్చీలో వెనక్కి వాలిపోయాడు నరసింహారావు.

జనవరి ఫస్టో, ఏప్రిల్ ఫస్టో బోధపళ్లేదు నాకు.

(7-1-78)